

పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 74,106 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 82,090 క్యూసెక్కులు వదులుతున్నారు.



విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

జె.పంగులూరు: మండల పరిధిలోని కొండమంజులూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థినులకు ఉచితంగా 365 సైకిళ్లను మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం పంపిణీ చేశారు.



దుర్గగుడి ట్రస్ట్ బోర్డు ప్రమాణం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ(గాంధీ), 15 మంది సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు.

న్యూస్‌రీల్

29న జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 29న ఉదయం 10.30 గంటలకు జరగనుంది. ఈ మేరకు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులకు సమాచారాన్ని పంపారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్న సమావేశంలో అజెండాలో పొందుపర్చిన అంశాలతో పాటు వివిధ శాఖల ప్రగతిపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

16న మెగా జాబ్‌మేళా



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయం, సమర్థనం సంస్థ సంయుక్తంగా ఈనెల 16న బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి.దుర్గాబాయి తెలిపారు. గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం పోస్టర్లు విడుదల చేశారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలతో 18 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని ఆమె పేర్కొన్నారు. రెజ్యూమ్, విద్యార్హతలు, ఆధార్ కార్డు ఫొటో స్టాట్ కాపీలతో ఈనెల 16న ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 63648 67800 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆధారాలతో నివేదిక సమర్పించండి

గుంటూరు డివిజన్ సహకారశాఖ అధికారి సేనారెడ్డి

సాక్షి ఎఫెక్ట్

కొరిటెపాడు(గుంటూరు): 'సహకారంలో జీతాల కుంభకోణం' శీర్షికన ఈనెల 10వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై సహకారశాఖ డివిజనల్ అధికారి సేనారెడ్డి స్పందించారు. వివరణాత్మక నివేదిక సమర్పించాలని మండల ఇన్‌చార్జిలను ఆదేశించారు. గుంటూరు డివిజన్‌లోని మండలాల్లో ఉన్న పీఏసీఎస్‌లకు కేటాయించిన మండల ఇన్‌చార్జిలు సోమవారం సాయంత్రం 5 గంటలకు సహకార శాఖ డివిజన్ కార్యాలయానికి ఆధారాలతో సహా వివరణాత్మక నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. సాక్షిలో ప్రచురితమైన సహకారంలో జీతాల కుంభకోణం అనే శీర్షికపై రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ కూడా ఆరాతీసినట్లు సమాచారం.

చేబ్రోలులో ఐదుగురికి డయేరియా లక్షణాలు



చేబ్రోలు: గుంటూరు జిల్లా చేబ్రోలులోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా వాంతులు, విరేచనాలు, జ్వరాల కేసులు అధికంగా నమోదు అవుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చేబ్రోలులోని చెరువులోపాలెంలో శనివారం ఐదుగురికి డయేరియా లక్షణాలు కనిపించటంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య చికిత్స అందజేస్తున్నారు. రెండు రోజులుగా వివిధ ప్రాంతాల్లో జ్వరాలు కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ వైద్యశాలతోపాటు, ఆర్‌ఎంపీలు, గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. చెరువులోపాలెంలో ఆహార కలుషితం కారణంగానే వాంతులు, విరేచనాలు బారిన పడినట్లు పీహెచ్‌సీ అధికారులు తెలిపారు. భయపడాల్సిన అవసరం లేదని, పరిస్థితి అదుపులోనే ఉందని పేర్కొన్నారు.

సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయం సందర్శన



తాడికొండ: అమరావతిలో నిర్మించిన ఏపీ సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ శనివారం సందర్శించారు. ప్రాజెక్టు కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు ఆయనకు వివరించారు.

కన్నకడుపు ఆక్రోశం

- జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిపై ప్రశ్నల వర్షం కురిపిస్తూ మండిపడ్డ విద్యార్థుల తల్లిదండ్రులు
- ఇక్కడే ఉంచి మా పిల్లల్ని చంపుకోమంటారా ?
- పిల్లలు అస్వస్థతకు గురై ఊసురోమంటుంటే కనీసం సమాచారం కూడా ఇచ్చే తీరిక, బాధ్యత మీకు లేదా ?
- పిల్లలతో అంట్లు తోమిస్తారా, బల్లులు పడిన నీళ్లు తాగమంటారా ?
- వార్డెన్, కుక్ ఉంటే పిల్లల్ని ఇక్కడ ఉంచం
- వార్డెన్, కుక్‌లపై విస్తుపోయేలా ఆరోపణలు చేసిన విద్యార్థులు



పెదనందిపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న అస్వస్థతకు గురైన విద్యార్థులు



శనివారం ఉదయం విద్యార్థులను 108లో జీజీహెచ్‌కి తరలిస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు: '' మేము ఎక్కడో వంద కిలోమీటర్ల దూరంలో ఉంటాం. ఇక్కడ మీరు ఉన్నారు. బాధ్యతగా ఉంటారనే కదా మా పిల్లల్ని మీ దగ్గర (హాస్టల్)లో వదిలేసి వెళ్లాం. ఆహారం కలుషితమై ఆస్పత్రిపాలైతే కనీసం మాకు సమాచారం ఇవ్వలేదు. ఇదేనా మీకు పిల్లలమీద ఉన్న బాధ్యత ? ఇక్కడ ఉంచి మా పిల్లల్ని మేం చంపుకోలేం'' అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా సంక్షేమశాఖ అధికారి మయూరిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇక్కడే ఉంచి మా పిల్లల్ని చంపుకోమంటారా.. అంటూ మండిపడ్డారు. పెదనందిపాడు మండలం అన్నపర్రులోని బీసీ బాలుర వసతి గృహంలో శుక్రవారం అస్వస్థతకు గురైన 54 మందిలో చికిత్స అనంతరం సాయంత్రానికి కొందరిని డిశ్చార్జ్ చేశారు. మరికొందరిని జీజీహెచ్‌కి రిఫర్ చేశారు. శిబిరంలో ఉన్న 24 మందిలో నలుగురిని అదేరోజు రాత్రి జీజీహెచ్‌కి తరలించారు. శనివారానికి కూడా మరో ఐదుగురికి కడుపునొప్పి తగ్గకపోవడం, బీపీ డౌన్ అవుతుండటంతో 108 వాహనంలో గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించారు. ఇంకా శిబిరంలో 15 మంది చికిత్స పొందుతున్నారు. మొత్తం మీద గుంటూరు జీజీహెచ్‌లో 26 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్నట్లు వైద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఫోన్ చేసే బాధ్యత లేదా ?

తమ పిల్లలు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఉదయానికి అన్నపర్రులోని బీసీ హాస్టల్‌కు చేరుకున్నారు. అక్కడ ఉన్న తమ పిల్లలతో మాట్లాడారు. సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఇంతలో అక్కడకు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి మయూరి వచ్చారు. దీంతో ఆమెపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నాస్త్రాలు సంధించారు. ఇంతటి ఘటన జరిగితే కనీసం తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. ఒక్క ఫోన్ చేసే తీరిక మీ వార్డెన్‌కు గానీ సిబ్బందికి, అధికారులకు లేదా? అని ప్రశ్నించారు. ఇంతటి నిర్లక్ష్యం ఏమిటని, ఇంత బాధ్యతారాహిత్యంగా ఎలా ఉంటారని? ఆగ్రహించారు. ''ప్రస్తుత పరిస్థితుల్లో హాస్టల్లో మా పిల్లలను ఉంచలేమని, మాతో ఇంటికి తీసుకువెళ్లిపోతా''మని బీసీ సంక్షేమశాఖ అధికారి మయూరికి తల్లిదండ్రులు తేల్చిచెప్పారు. స్పందించిన ఆమె అలా పంపిచడానికి కలెక్టర్ పర్మిషన్ ఇవ్వలేదన్నారు. ఇప్పుడు పిల్లల్ని తీసుకుని వెళితే మొత్తానికే తీసుకెళ్లిపోవడమేనని, ఇక మళ్లీ హాస్టల్‌కు రావడం ఉండదు.. స్కూల్‌కు వెళ్లడం ఉండదంటూ బెదిరింపు ధోరణిలో యమూరి సమాధానమిచ్చారు. దీంతో తల్లిదండ్రుల్లో ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. ఇక్కడ ఉంచి మా పిల్లల్ని చంపుకోలేమని తల్లిదండ్రులు నిప్పులు చెరిగారు. వెంటనే ఇక్కడి నుంచి వార్డెన్‌ను, కుక్‌ను తొలగించేస్తామని, ఇకపై ఎలాంటి ఇబ్బందులుండవని మయూరి తల్లిదండ్రులకు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

మా పిల్లల్ని మాతో పంపించండి !

ఇదిలా ఉంటే ప్రత్యేక వైద్య శిబిరం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కల్యాణ మండపంలో బల్లలపై నొప్పులతో బాధపడుతూ చికిత్స పొందుతున్న తమ పిల్లలను చూసి తల్లిదండ్రులు చలించిపోయారు. ''అయ్యా.. మీకు పుణ్యముంటది.. మా పిల్లలను మాతో పంపించండి. మేము తీసుకువెళ్లి చికిత్స చేయించుకుంటా''మంటూ నెత్తీనోరూ బాదుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఉన్నా కొందరికి శనివారం వరకు కూడా నొప్పులు తగ్గకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై తమ వెంట తీసుకువెళతామంటూ పట్టుబట్టారు. అయితే, అందుకు కలెక్టర్ అనుమతి కావాలంటూ అధికారులు తల్లిదండ్రులకు నచ్చజెప్పారు.

బూతులు తిడతారు.. రూమ్‌లో కోటింగ్ ఇస్తారు !



కన్నీటి పర్యంతమవుతూ వార్డెన్ వేధింపులను జిల్లా సంక్షేమశాఖ అధికారికి వివరిస్తున్న విద్యార్థులు

హాస్టల్ విద్యార్థులు శనివారం జిల్లా సంక్షేమ అధికారి మయూరి ఎదుట విస్తుపోయే వాస్తవాలను వెల్లడించారు. హాస్టల్ వార్డెన్ విపరీతంగా బూతులు తిడతారని, మాతోనే అంట్లు తోమిస్తారని, భోజనం అస్సలు బాగుండదని వాపోయారు. ఇదే విషయాన్ని ఫిర్యాదు చేసినా, ఎవ్వరైనా వచ్చినప్పుడు చెప్పినా.. ఆ తరువాత మమ్మల్ని రూమ్‌లోకి తీసుకువెళ్లి ఇష్టమొచ్చినట్లు కొడతారని మయూరి ఎదుట ఆరోపించారు. అంట్లు, వంటపాత్రలు కూడా కడిగిస్తారని చెప్పారు. ఇడ్లీ పాత్రలో బల్లి పడితే ఆ పాత్రలు శుభ్రం చేయకుండానే పెట్టారని, పాలల్లో కూడా బల్లి పడిందని ఫిర్యాదు చేశారు. ఇవన్నీ అడిగితే కర్ర తీసుకుని కొడుతున్నారని, ఎవ్వరికైనా చెబితే టీసీలిస్తామంటూ బెదిరిస్తున్నారని కన్నీటి పర్యంతమవుతూ విద్యార్థులు వాపోయారు. దీంతో చలించిపోయిన తల్లిదండ్రులు పిల్లలతో అంట్లు తోమించడం, బల్లి పడ్డ నీళ్లు తాగించడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు.

మీకో దండం.. మీ హాస్టల్‌కో దండం !



హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్లిపోతున్న విద్యార్థులు

హాస్టల్‌లో పరిస్థితులు సరిగాలేకపోవడంతో ఆందోళనకు గురైన విద్యార్థులు ఇంటిబాట పట్టారు. కొందరు ఉదయాన్నే బ్యాగులు సర్దుకుని హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్లిపోగా, మరికొందరిని తల్లిదండ్రులు తీసుకువెళ్లిపోయారు. సుమారు 23 మంది విద్యార్థులు హాస్టల్లో ఉండలేమంటూ వెళ్లిపోయారు. అనంతరం హాస్టల్‌కు చేరుకున్న బీసీ సంక్షేమశాఖ అధికారి మయూరి వార్డెన్ మార్కండేయులుతో పాటు, ఏబీసీడబ్ల్యూపై మండిపడ్డారు. ''ఇది హాస్టల్ అనుకుంటున్నారా.. లేక మీ ఇళ్లు అనుకుంటున్నారా..? పిల్లల్ని ఎవ్వరి అనుమతితో ఇంటికి పంపించారు..?'' అంటూ సిబ్బందిపై ఫైర్ అయ్యారు. వెంటనే వెళ్లిన పిల్లల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి వెనక్కు రప్పించాలని, మిగిలిన పిల్లలు ఎక్కడెక్కడున్నారో వెతికి పట్టుకుని హాస్టల్‌కు తీసుకురావాలని ఆదేశించారు.

జీజీహెచ్‌ను సందర్శించిన కలెక్టర్

- అత్యవసర సేవలు అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉండాలి
- అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి



ఆసుపత్రిలో వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

గుంటూరు మెడికల్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)ని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా శనివారం సందర్శించారు. వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న వారిని పరిశీలించారు. బీసీ వసతి గృహం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ తెలియజేశారు. విద్యార్థులకు, అత్యవసర చికిత్సల కోసం వచ్చే ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందించడానికి వైద్యులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వివిధ విభాగాల్లో మరమ్మతులకు గురైన పరికరాలను ఉపయోగంలోకి తీసుకుని రావాలని చెప్పారు.

విద్యార్థులంతా సేఫ్

అన్నపర్రు వసతి గృహంలో విద్యార్థులంతా ఆరోగ్యంగానే ఉన్నారని జిల్లా సాంఘిక, బీసీ సంక్షేమ అధికారి చెన్నయ్య తెలిపారు. జిల్లాలో ఉన్న 33 వసతి గృహాలకు గాను, 24 చోట్ల ఇప్పటికే నీటి నమూనా పరీక్షలు నిర్వహించామని చెప్పారు. మిగిలిన చోట్ల త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. అన్ని వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసినట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయికుమార్, ఇతర అధికారులు అన్నపర్రులో పర్యటించారు. పారిశుద్ధ్య పనులు, తాగునీటి పరిస్థితులు పరిశీలించారు.

ఆరోగ్యం కుదుటపడ్డాకే విద్యార్థుల డిశ్చార్జి

టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రి సవిత స్పష్టం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అన్నపర్రు బీసీ హాస్టల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి ఆరోగ్యం పూర్తిగా మెరుగయ్యాకే డిశ్చార్జి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణతో మంత్రి సవిత శనివారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణను అడిగి తెలుసుకున్నారు. 60 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరగా, ప్రస్తుతం 24 మంది మాత్రమే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఒక విద్యార్థి ఐసీయూలో చికిత్స అందజేస్తున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ వివరించారు. ఆ విద్యార్థి ఇంతకుముందు నుంచే కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో ఐసీయూలో వైద్యమందిస్తున్నామని తెలిపారు. మరో ఇద్దరు విద్యార్థులు పెదనందిపాడు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థులను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశామన్నారు. మంత్రి సవిత స్పందిస్తూ, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడిన తరవాతే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై గంటకు గంటకూ అప్‌డేట్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న విద్యార్థిని తక్షణమే ఎయిమ్స్‌కు తరలించాలని మంత్రి సవిత ఆదేశించారు.

వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి

డిశ్చార్జి అయిన వారితో పాటు హాస్టల్‌లో మిగిలిన విద్యార్థులను వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణను, డైరెక్టర్ మల్లికార్జునను మంత్రి సవిత ఆదేశించారు. హాస్టల్‌లో పరిశుభ్రతతపై తీసుకున్న చర్యల గురించి డీబీసీడబ్ల్యూవో మయూరిని అడిగి తెలుసుకున్నారు. కాచి చల్లార్చిన నీటితోపాటు తాజా ఆహారమే వారికి అందివ్వాలన్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ చల్లాలని స్పష్టం చేశారు. హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్లకు వెళ్లదలుచుకున్న విద్యార్థులను వారి తల్లిదండ్రులను పిలిచి వారితో పంపించాలని సూచించారు.

ఘటనలు పునరావృతం కానివ్వొద్దు

అన్నపర్రు బీసీ హాస్టల్ లాంటి ఘటన రాష్ట్రంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండేలా వార్డెన్లను ఆదేశించాలన్నారు. డీబీసీడబ్ల్యూవోలు తమ పరిధిలో హాస్టళ్లను నిరంతం పర్యవేక్షించాలని తెలిపారు. హాస్టళ్లలో వార్డెన్లు ఉండేలా చూడాలని, బయట ఆహారం లోపలకు రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రి సవిత స్పష్టం చేశారు.

పెద్దాసుపత్రికి సుస్తీ

- జీజీహెచ్‌లో వసతులు కరువు
- రోగులకు అవస్థలు
- పిల్లల వార్డులో తుప్పపట్టిన మంచాలు
- పనిచేయని ఏసీలు
- దుప్పట్లు మార్చడం లేదు
- బాత్‌రూమ్స్‌కు డోర్స్ లేవు



పనిచేయని ఫోటోథెరపీ మిషన్, వార్మర్ మిషన్‌లో పసికందులు



108 పిల్లల వార్డులో నర్సులు లేకుండా ఖాళీగా ఉన్న కుర్చీలు



పనిచేయని ఏసీలు



అపరిశుభ్రంగా ఉన్న బెడ్‌షీట్



తుప్పు పట్టిన మంచం

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఏపీలో పేదల పెద్దాసుపత్రిగా పేరు గడించిన గుంటూరు జీజీహెచ్‌లో సమస్యలు ఏకరవు పెడుతున్నాయి. ఇటీవల డయేరియా బాధితుల వార్డులో వసతులు లేక రోగులు నరకయాతన పడ్డారు. నేడు పెద్దాసుపత్రికి చికిత్స కోసం వచ్చిన బీసీ హాస్టల్ విద్యార్థులు కూడా అవస్థలు పడుతున్నారు. పిల్లల వార్డులో పలు సమస్యలు తిష్ట వేశాయి. ఇటీవల గుంటూరు నగరంలో డయేరియాతో సుమారు 200 మంది వరకు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందారు. బాధితుల కోసం ఆస్పత్రి అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డులో వసతులు కరువయ్యాయి. సెలైన్ స్టాండ్స్ సరిపడా లేక కిటికీలకు వేలాడదీశారు. పడకలపై బెడ్ షీట్స్ లేవు. మరుగుదొడ్లలో నీటి సమస్య నెలకొంది. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదు. సమస్యల మధ్యే రోగులు చికిత్స పొందారు.

సమస్యలు స్వాగతం

నేడు వాంతులు, విరేచనాలతో అనపర్రు బీసీ హాస్టల్ విద్యార్థులు పిల్లల వైద్య విభాగానికి వచ్చారు. ఒక పక్క అనారోగ్యంతో బాధపడుతూ, మరో పక్క వార్డులో వసతుల లేమి, సమస్యల మధ్యే చికిత్స పొందుతున్నారు. వార్డు వ్యాధి బాధితులతో కిక్కిరిసి పోయింది. ఏసీలు పనిచేయక చిన్నారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పడకలపై కనీసం బెడ్‌షీట్లు కూడా లేవు. మంచాలు సైతం తుప్పు పట్టిపోయాయి. రోగి పడుకుని చికిత్స పొందాలంటేనే భయపడే విధంగా ఉన్నాయి. వార్డుల్లో వైద్య సిబ్బందికి సైతం వసతులు లేక ఇక్కట్లు తప్పడం లేదు. పిల్లల వార్డులోని బాత్రూమ్‌కు కనీసం డోర్ కూడా లేకపోవడం దారుణం.

తనిఖీలకే అధికారులు పరిమితం

ఆస్పత్రి అధికారులు ప్రతిరోజూ తనిఖీల పేరుతో పలు వార్డుల్లో తిరుగుతున్నా ప్రయోజనం లేదు. వార్డుల్లో సమస్యలు అధికారులు కనిపించటం లేదా? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. సమస్యలను ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించటం లేదనే ఆరోపణలు సిబ్బంది నుంచి వినిపిస్తున్నాయి. ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా 'మీ కోసం మేము' అనే కార్యక్రమాన్ని ఆస్పత్రి అధికారులు నిర్వహిస్తున్నారు. రోగులను ఒకచోట సమావేశపరిచి సమస్యలు ఉంటే చెప్పాలని, తక్షణమే పరిష్కరిస్తామని భరోసా మాటలు చెబుతున్నారు. అయితే, అవి కార్యరూపం దాల్చడం లేదు. అధికారుల తూతూమంత్రంగా తనిఖీలు చేసి సమస్యలు పట్టించుకోవటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రి అధికారులు ఇకనైనా స్పందించి, ప్రశాంతమైన వాతావరణంలో వైద్యసేవలు అందించేలా చూడాలని పలువురు రోగులు కోరుతున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,400 గరిష్టం : రూ. 2,000

మోడల్ ధర రూ. 1,700

క్లుప్తంగా

పీఎం ధన, ధాన్య, కృషి యోజన ప్రారంభం



గుంటూరు రూరల్: గుంటూరులోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శనివారం దేశ ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రధానమంత్రి ధన, ధాన్య, కృషియోజన పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రధానమంత్రి ధన, ధాన్య కృషి యోజన అమలుకు మన రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. అక్కడ వాతావరణంలో ప్రతికూల పరిస్థితులు, అతి తక్కువ దిగుబడి తదితర సమస్యలు అధిగమించేందుకు ఈ పథకం ఉపయోగ పడుతుందని తెలిపారు.

ఆధునిక దేవాలయాల అమ్మకం అక్రమం

- ఎమ్మెల్సీ అప్పిరెడ్డి
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకరంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం



సంతకం చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, నేతలు

పట్నంబజారు: పేదలకు ఎంతగానో ఉపయోగపడే వైద్య కళాశాలలు, వాటికి అనుబంధంగా ప్రభుత్వ రంగంలో పూర్తి కార్పొరేట్ హంగులతో ఏర్పాటయ్యే బోధనాసుపత్రులకు కూటమి ప్రభుత్వం మోకాలడ్డుతుందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేస్తూ శనివారం కోటి సంకతకాల సేకరణ కార్యక్రమాన్ని బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ప్రారంభించారు. తొలుత తాను స్వయంగా సంతకం పెట్టి తర్వాత ప్రజలతో దగ్గరుండి మరీ సంతకాలు చేయించారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ ఆధునిక దేవాలయాల అమ్మకం అక్రమమని మండిపడ్డారు. పేద ప్రజలకు కీడు చేసే వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు తక్షణమే స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కోటి సంతకాల సేకరణతో కూటమి ప్రభుత్వ కూసాలు కదిలిస్తామని స్పష్టం చేశారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలన్న సంకల్పంతో వైఎస్ జగన్ రూ. 8,500 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారన్నారు. తద్వారా పేద విద్యార్థులు సైతం ప్రాణం పోసే వైద్యులుగా మారతారని, మరోవైపు వైద్య కళాశాలలకు అనుబంధంగా ఏర్పడే బోధనాగసుపత్రుల వల్ల లక్షలాది మంది పేద వర్గాల ప్రజలకు ఉచితంగా వైద్యం అందుతుందని వివరించారు. ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు నిరసనగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్టోబర్ 10 నుంచి నవంబరు 22 వరకు కార్యాచరణ నిర్దేశించినట్లు తెలిపారు. దాని ప్రకారం గ్రామ, వార్డు స్థాయిల్లో రచ్చబండ పెట్టి అన్నింటిపై ప్రజల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు చెప్పారు. అక్టోబరు 28న నియోజకవర్గ కేంద్రాల్లో, నవంబరు 12న అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి గ్రామం నుంచి 500 సంతకాల చొప్పున ప్రతి నియోజకవర్గంలో 50 వేలకు తగ్గకుండా, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం కోటి సంతకాలు సేకరించి, ఆ ప్రతులను రాష్ట్ర గవర్నర్‌కు సమర్పించనున్నట్లు వివరించారు. పేద ప్రజలకు శాపంగా మారిన ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ సంతకాల సేకరణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై వ్యతిరేకతను ఎలుగెత్తి చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ పాపతోటి అంబేడ్కర్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్ పాల్గొన్నారు.



కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రజలకు వివరిస్తున్న అంబటి మురళీకృష్ణ

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఉద్యమం

పొన్నూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయాలనే కూటమి ప్రభుత్వం విధానాలపై వైఎస్సార్ సీపీ తీవ్రస్థాయిలో పోరాటం చేస్తుందని పార్టీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. పీపీపీ విధానంలో ప్రైవేటుకు ధారాదత్తం చేయడానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ తలపెట్టిన రచ్చబండ కార్యక్రమాన్ని మండలంలోని మామిళ్లపల్లిలో శనివారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్, మహానేత డాక్టర్. వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద విద్యార్థుల భవిష్యత్ కోసం వైఎస్. జగన్ చేపట్టిన మెడికల్ కళాశాలలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కోటి సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా కరపత్రాలను ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేశారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ వైద్య విద్యను పేద విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. కానీ నేటి కూటమి ప్రభుత్వం దాన్ని ధనార్జనే లక్ష్యంగా పెత్తందార్లకు కట్టబెట్టే పనిలో నిమగ్నమైందని మండిపడ్డారు. ఇదే కొనసాగితే భవిష్యత్తులో గ్రామాల్లో ప్రభుత్వ వైద్యశాలలు ఉండవని, అందరూ డబ్బులు చెల్లించే ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడనుందని చెప్పారు. నియోజకవర్గంలో వైద్య బకాసురుడు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఉన్నాడని విమర్శించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణలో అతని ప్రమేయం కూడా ఉందని ఆరోపించారు. సంగం డైరీ పేరుతో ఆక్రమించిన స్థలంలో డీవీసీ పేరుతో కార్పొరేట్ వైద్యశాల ఏర్పాటు చేసి సీఎం రిలీఫ్‌ఫండ్ పేరుతో రూ. లక్షలు వసూలు చేస్తూ ఖజానా నింపుకుంటున్నాడని దుయ్యబట్టారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నియోజకవర్గంలో 60 వేల సంతకాల సేకరణలో అందరూ భాగస్వాములు కావాలని మురళీకృష్ణ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ డాక్టర్ రూత్ రాణి, జిల్లా అధికార ప్రతినిధి ఎండేటి వెంకట సుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షులు చిర్ర అక్కిరెడ్డి, ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఎన్. రవీంద్రబాబు, పార్టీ మండల అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ, ప్రధానకార్యదర్శి తుపాకుల గోవర్ధన్, వాణిజ్య విభాగం అధ్యక్షులు చెట్టుపల్లి కృష్ణ, మైనార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, మహిళా విభాగం అధ్యక్షులు మరియ రాణి, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షులు రుద్రపాటి నాగేశ్వరరావు, ప్రచార విభాగం అధ్యక్షులు తురిమెళ్ల రాజశేఖర్, నాయకులు షేక్ నాజర్, ఆర్. ఆదిశేషు, సుషోబిత, లంకపోతు పిచ్చిరెడ్డి, జల్లి విల్సన్, కమలాకర్, సూరిశెట్టి శివయ్య, పోలూరి పూర్ణచంద్రా రెడ్డి, సర్పంచ్ బుడే సాహెబ్, తమనం ఆదాం, దిలార్ బాష, గోపిశెట్టి వాసు పాల్గొన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీలో 5జీ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డీవోటీ) ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన 5జీ ల్యాబ్ - గ్లోబల్ డిజిటల్ ఇన్నొవేషన్ సెంటర్‌ను బీఎస్ఎన్ఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఏ.రాబర్ట్ జే రవి వర్చువల్‌గా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5జీ ల్యాబ్ ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడమే కాకుండా, విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్, స్మార్ట్ సిటీస్, లాజిస్టిక్స్, ఈ-గవర్నెన్స్ వంటి కీలక రంగాలలో నవీన ఆవిష్కరణలు, అనువర్తనాలను అభివృద్ధి చేసే దిశగా ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. ల్యాబ్‌లో పూర్తిస్థాయి 5జీ స్టాండలోన్ సెటప్ ఏర్పాటు చేయబడిందని, ఇందులో సిమ్‌లు, డాంగిల్స్, ఐవోటీ గేట్‌వేలు, రౌటర్లు, అప్లికేషన్ సర్వర్లు మొదలైన పరికరాలు ఉంటాయన్నారు. బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం మాట్లాడుతూ 5జీ ల్యాబ్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, విద్యార్థులు రియల్‌టైమ్‌లో కలిసి పనిచేసే అవకాశం లభిస్తుందని అన్నారు. ప్రాజెక్ట్ ఆధారిత లెర్నింగ్, లైవ్ డేటా అనలిటిక్స్ ద్వారా పరిశోధన మరింత బలోపేతం అవుతుందని వివరించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతికతలలో ముందంజలో ఉండేందుకు 5జీ ల్యాబ్ ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ అప్కాస్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ అప్కాస్ ఉద్యోగి ఉదయ్‌చంద్ర శనివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. ''ఎలక్ట్రికల్ ఏఈ మధు నన్ను విధుల్లో ఇబ్బందులకు గురి చేయడంతో పాటు దుర్భాషలాడాడని.. నా చావుకు మధునే కారణం'' అని సెల్ఫీ వీడియో తీసుకుని పోస్ట్ చేయడంతో సోషల్ మీడియాలో కలకలం రేపింది. స్నేహితులు అడ్డుకోవడంతో ఆత్మహత్యాయత్నాన్ని ఆపేసినట్లు ఉదయ్‌చంద్ర తెలిపాడు. దీనిపై ఏఈ మధుసూదన్‌రావును వివరణ కోరగా గతంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఉదయ్‌చంద్రపై పశ్చిమ ఎమ్మెల్యే పలు ఆరోపణలు చేశారన్నారు. విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, లైట్లు ఆన్/ఆఫ్ సక్రమంగా చేయడం లేదని, ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదని సభ దృష్టికి తెచ్చారన్నారు. కార్పొరేటర్ల ఫోన్లకు స్పందించడం లేదని, ఉదయ్‌చంద్రను విధుల నుంచి తీసివేయాలని సూచించడంతో కొన్ని రోజులు ఆపామని ఏఈ వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు మళ్లీ చేయనని చెప్పడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 29, 30వ డివిజన్లలో పనిచేస్తున్న ఉదయ్‌చంద్రను బుడంపాడు లైట్లు ఆన్/ఆఫ్‌కు మార్చినట్లు తెలిపారు. ఆ విధులకు కూడా హాజరు కాకపోవడంతో అతన్ని ప్రశ్నించడంతో ఆత్మహత్యాయత్నం చేస్తున్నట్లు బెదిరింపులకు దిగాడని మధు వివరించారు.

వ్యర్థాలతో వ్యాప్తి చెందుతున్న క్యాన్సర్

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- మురుగునీటి శుద్ధి ప్లాంటు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరణలో మంత్రి మనోహర్, కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి: ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పంట పొలాలు, నీటిలో కలుస్తుండటంతో క్యాన్సర్ వ్యాప్తి చెందుతోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఈ పరిస్థితి దీర్ఘకాలం ఉండరాదనే తెనాలికి రూ.30 కోట్ల వ్యయంతో 10 ఎంఎల్‌డీ లీటర్ల మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. పట్టణ పూలే కాలనీలో నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని శనివారం రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ముఖ్య అతిథి పెమ్మసాని మాట్లాడుతూ తెనాలి రైల్వేస్టేషను అభివృద్ధి చెందుతోందని తెలిపారు. తెనాలి-మంగళగిరి రోడ్డు, నారాకోడూరు-తెనాలి రోడ్డును అద్దంలాగ తీర్చిదిద్దినట్టు చెప్పారు. డాక్టర్ ప్రతాప్ కోటి రూపాయల వితరణతో జిల్లా ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వీటిన్నిటి నిర్వహణను ఎక్కడికక్కడ స్థానికులతో ఏర్పాటైన కమిటీలు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలంతా నగదు స్థానంలో డిజిటల్ చెల్లింపులు చేస్తే అమరావతి అమెరికాలా అవుతుందని సూచించారు. జీఎస్టీ తగ్గింపు పాటించని వ్యాపారులను ప్రశ్నించాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ మురుగునీటి సమస్య పరిష్కారానికి ప్రస్తుతం ప్రారంభించిన ప్లాంటుతో పాటు పట్టణానికి రెండో వైపున మరో 10 ఎంఎల్‌డీ లీటర్ల మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజారోగ్యశాఖ, మున్సిపాలిటీలు ఒక నోడల్ అధికారితో ప్లాంట్ నిర్వహణను సమీక్షిస్తుండాలని సూచించారు. స్వచ్ఛత కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజల సహకారం ఉండాలని కోరారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అమృత పథకం కింద నిర్మించిన చాలా ప్లాంట్లలో నిర్వహణ సరిగా లేదని తెలిపారు. తెనాలి ప్లాంటును సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వార్డు కౌన్సిలర్ కఠారి రత్నకుమారి పలు ప్రధాన సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా సహకార మార్కెటింగ్ చైర్మన్ హరిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ రామ అప్పలనాయుడు, ప్రజారోగ్యశాఖ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల పోరుబాట

తెనాలిలో కార్యాచరణ ప్రకటించిన రాష్ట్ర జేఏసీ నాయకులు



మాట్లాడుతున్న రాష్ట్ర జేఏసీ కోఆర్డినేటర్ సతీష్

తెనాలి అర్బన్: కూటమి ప్రభుత్వం జాబ్ చార్టుకు వ్యతిరేకంగా సచివాలయ ఉద్యోగులకు అన్ని రకాల విధులను అప్పగించటం వల్ల వారి ఆత్మగౌరవం దెబ్బతింటోందని డెమోక్రటిక్ ఏపీసీఎస్‌డబ్ల్యూఎస్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ బండికల్ల సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తెనాలిలోని సామ్రాట్ హోటల్‌లో శనివారం ఆత్మగౌరవ సభను నిర్వహించారు. సమావేశానికి జేఏసీ రాష్ట్ర చైర్మన్ జి. జోసఫ్ కిశోర్ అధ్యక్షత వహించారు. సతీష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను రద్దు చేసి వారి విధులను కూడా సచివాలయంలోని ఉద్యోగులకు అప్పగించడం వల్ల సతమతమవుతున్నారని తెలిపారు. వలంటీర్ల కోసం ఏర్పాటు చేసిన క్లస్టర్లను ఉద్యోగులకు బదలాయించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదని విమర్శించారు. ఉద్యోగులపై పని భారం పెంచటం వల్ల మానసిక ఒత్తిడికి గురై కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు జేఏసీలుగా చలామణి అవుతూ తప్పుడు నిర్ణయాలు తీసుకుని ఉద్యోగులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల రెండు వేల మందిపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం దిగిందని, వెంటనే దాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల మనోభావాలకు అనుగుణంగా ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తున్నామని చెప్పారు. జేఏసీ రాష్ట్ర వర్కింగ్ సెక్రటరీ అప్పికట్ల కిశోర్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులపై కొందరు అనుచితంగా ప్రవర్తిస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్పష్టమైన జాబ్ చార్టును ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ నోషనల్ ఇంక్రిమెంట్ ప్రకటించటంతో పాటు హేతుబద్ధంగా పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతర్ జిల్లాల బదిలీలకు అనుమతి ఇవ్వాలని కోరారు. సమావేశంలో ట్రెజరర్ దుర్గాప్రసాద్, కన్వీనర్లు జీవన్ సాగర్, మదన్ మోహన్, శంకరరావు, శామ్యూల్, డైమండ్ బాబు, కీర్తి సాగర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం



సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఉద్యమాలు చేయనున్నాం. దీనిలో భాగంగా నెల రోజుల పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను కలిసి వినతి పత్రాలు ఇస్తాం. 45 రోజుల తర్వాత నోటీసులు ఇచ్చి సమ్మెకు దిగుతాం. ప్రభుత్వం వెంటనే స్పందించి సచివాలయాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి.

-జి. జోసఫ్ కిశోర్, జేఏసీ రాష్ట్ర చైర్మన్

సర్వేల పేరుతో వేధింపులు ఆపాలి



సర్వేల పేరుతో ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులను వేధిస్తోంది. నిత్యం వార్డులు, గ్రామాల్లో ఉద్యోగులు తిరుగుతుండటం వల్ల సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుంది. అంతేకాకుండా సెలవు రోజుల్లో కూడా పనిచేయాల్సి వస్తోంది. వెంటనే సర్వేల పేరుతో జరుగుతున్న వేధింపులు మానుకోవాలి.

-పి. చిన్న వెంకటేశ్వర్లు,
ఎస్సీ,ఎస్టీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

109 మంది వీవీఐబీయూ విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులతో వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్ తదితరులు

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ (వీవీఐబీయూ)కి చెందిన 109 మంది విద్యార్థులు కాగ్నిజెంట్ (డిజిటల్ నర్చ్యూర్) డెల్టా ఎక్స్, ఫ్లిప్ట్ ల్యాబ్స్, జెన్‌ట్రీ ట్యాబ్స్, టెక్ అవుట్ సొల్యూషన్స్, ఈఫిల్ టెక్ సొల్యూషన్స్, పాలెక్, సెర్వాడ్ వంటి బహుళ జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు పొందారని వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. మండలంలోని నంబూరు వీవీఐటీ యూనివర్సిటీలో ఆగస్టు, సెప్టెంబర్‌లలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 2022-2026 బ్యాచ్ విద్యార్థులు రూ.3 లక్షల నుంచి రూ. 8 లక్షల వార్షిక వేతనంతో నియామకాలు పొందారని తెలిపారు.

ప్రజా ఫిర్యాదులు రాసేందుకు ప్రత్యేక పోలీస్ సిబ్బంది

నగరంపాలెం: స్థానిక నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కారాల వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో ఫిర్యాదిదారుల అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా పోలీస్ సిబ్బందిని కేటాయించినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం పేర్కొన్నారు. అర్జీలు రాయించుకునేందుకు బయట నగదు చెల్లించలేక పలువురు ఇబ్బందులకు గురవుతున్నారనే దృష్ట్యా సుశిక్షితులైన పోలీస్ సిబ్బందిని కేటాయించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈనెల 13 నుంచి డీపీఓలో పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉంటారని వివరించారు.